## డెంగ్యూతో మహిళ మృతి


వంగల జ్యోతి(ఫైల్)

ములుగురూరల్, సెప్టెంబర్11: డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ మహిళ మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో బుధవారం చోటుచేసుకుంది. గొల్లవాడ కాలనీకి చెందిన వంగల జ్యోతి (48) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. స్థానికంగా వైద్యం చేయించినా తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిందని స్థానికులు తెలిపారు.



## రోడ్డుపై ఆడ శిశువు

### ఐసీడీఎస్ కేంద్రానికి తరలించిన పోలీసులు

దేవరకద్ర, సెప్టెంబర్ 11: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూరు స్టేజీ సమీపంలో ఓ ఆడ శిశువు లభ్యమైంది. బుధవారం ఉదయం 6:30 గంటలకు దేవరకద్ర సహకార సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి వాకింగ్ వెళ్లగా.. రోడ్డు పక్కన శిశువు ఏడుపు వినిపించింది. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్య క్తులు శిశువును బస్తాలో ఉంచి వెళ్లా రు. శిశువుకు చీమలు పట్టి ఉన్నట్టు గమనించారు. వెంటనే అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మికి సమాచారం అందించగా.. ఆమె అక్కడికి చేరుకొని పసికందును స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా.. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగన్న శిశువును ఐసీడీఎస్ కేంద్రానికి తరలించారు.

## చోరీకి వెళ్లి కరెంట్ షాక్‌తో తండ్రీకొడుకు మృతి

మిడ్జిల్, సెప్టెంబర్ 11: చోరీ చేసేందుకు వెళ్లిన తండ్రీకొడుకు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలానికి చెందిన బాలస్వామి (42), జయరాజ్ (17) తండ్రీకొడుకులు. మంగళవారం అర్ధరాత్రి మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్‌లో దొంగతనం చేయడానికి వచ్చారు. ఇక్కడ అమర్చే తీగల్లో ఉండే రాగి తీగను చోరీ చేయాలని ప్రయత్నించారు. సోలార్ ప్లాంట్‌లో గతంలో పలు మార్లు రాగి తీగ కోసం చోరీలు జరగడంతో అధికారులు ఫెన్సింగ్ వైర్‌కు విద్యుత్తు సరఫరా చేశారు. ఈ విషయం తెలియని ఇద్దరు ప్రహరీపై ఉన్న ఎలక్ట్రిక్ వైర్లను కట్ చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు బుధవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని వారి మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

# మునిగిన బతుకు ఆశలకు వేలాడి


ఇటీవల ముంచెత్తిన మున్నేరు వాగు వరదల్లో చిక్కుకున్న కాంప్లెక్స్ ఇది. ఖమ్మం పట్టణం బొక్కలగడ్డలోని ఈ కాంప్లెక్స్ వాసులకు చివరకు మిగిలింది ఇవే. వానలు, వరదల్లో పాడైపోగా మిగిలిన వాటిని బుధవారం ఇలా ఆరబెట్టారు

### ◆ ఆమెకెంత కష్టం


కర్ణగిరిలోని రాజీవ్‌గృహకల్పలోకి నీళ్లు చేరడంతో ఫ్రిజులు, టీవీలు, కూలర్లు వంటివన్నీ పాడైపోయాయి. అలా పాడైపోయిన ఫ్రిజ్‌లను ఆరుబయట ఆరబెడుతున్న మహిళలు

మొన్నటి భారీ వర్షాల ధాటికి కన్నీటి సంద్రమైన ఖమ్మం పట్టణం ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నది. వానల్లో, వరదల్లో సర్వం కోల్పోయిన వరద బాధితులు పాడైపోయిన వస్తువులను బాధాతప్త హృదయంతో పాత సామాన్ల దుకాణాలకు తరలిస్తున్నారు. కొద్దోగొప్పో మిగిలినవాటిని ఆర బెట్టుకుంటూ, శుభ్రం చేసుకుంటూ జీవనయానం సాగించేందుకు సిద్ధమవు తున్నారు.

-ఫొటోలు మహేశ్ భండారి

### రేపటి వెలుగుల కోసం


వెంకటేశ్‌నగర్‌లో వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్తు మీటర్లను మరమ్మతు చేస్తున్న సిబ్బంది

### ◆ కన్నీటి తడి ఆరేనా!


బొక్కలగడ్డలో వరదల కారణంగా ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని పుస్తకాలు, రికార్డులు తడిసిపోయాయి. తన బిడ్డ భవిష్యత్‌కు ఎంతో విలువైన పుస్తకాలను ఆరబెడుతున్న ఓ తండ్రి

### ◆ మునిగిన సామాన్లు కొంటాం!


మున్నేరు వాగు మిగిల్చిన దుఃఖం ఇది. వరదల్లో పాడైపోయిన విలువైన వస్తువులన్నీ ఇలా భారంగా పాత సామాన్ల దుకాణానికి వెళ్తున్నాయి

### ◆ తరలిపోయే జీవితం


వీరికి సొంత గూడు లేదు. జూబ్లీపురాలో అద్దె ఇంట్లో కాపురం చేస్తున్నారు. మొన్నటి వరదలు సర్వం ఊడ్చేయడంతో ఇక అక్కడ ఉండలేక, మిగిలిన కొద్దిపాటి సామాన్లతో చంటి బిడ్డను పొత్తిళ్లలో పెట్టుకుని తరలిపోతున్న ఇల్లాలు

# రాత్రికి రాత్రే మునిగిపోయాయి

**కేంద్ర బృందానికి బాధితుల మొర • కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలంలో పర్యటన**

కూసుమంచి/ ఖమ్మం రూరల్ /మహబూబాబాద్, సెప్టెంబర్ 11: 'వందేండ్లలో ఎన్నడూ ఇలాంటి విపత్తు రాలేదు. రాత్రికి రాత్రే ఇళ్లు, పొలాలు మునిగిపోయాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. కాలువలకు గండ్లు పడ్డాయి. పచ్చటి పంటలన్నీ మా కళ్లేదుటే ఎడారిలా మారాయి. అన్నింటా అపార నష్టం జరిగింది. ఆదుకోండి సారూ..' అంటూ కేంద్ర బృందం ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన వరద బాధితులు. ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం అధికారులు బుధవారం పర్యటించారు. దీంతో వరద బాధితులు, రైతులు తమ ఆవేదనను కేంద్ర బృందానికి వినిపించారు. కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ కూడా నష్ట తీవ్రత గురించి కేంద్ర అధికారులకు వివరించారు. పంటల నష్టానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఇసుక మేట వేసిన పొలాలను పరిశీలించారు. కేంద్ర బృందం అధికారులు కే.ప్రతాప్‌సింగ్, మహేశ్‌కుమార్, శాంతి స్వరూప్, కుషవహా, నియల్‌ఖాన్ సన్, శశివర్ధన్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. అదనపు కలెక్టర్ మధుసుదన్‌నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**చీకట్లో వరద నష్టం అంచనా**

అనంతరం మహబూబాబాద్ జిల్లాలోని అబ్బాయి పాలెంలో వరదలకు కొట్టుకుపోయిన పంచాయతీ రాజ్ రోడ్లను, గాలివారిగూడెం, పురుషోత్తమాయ గూడెం, ముల్కలపల్లి బ్రిడ్జిలను పరిశీలించారు. రాత్రి కావడంతో టార్చిలైట్ల, కారు వెలుతురులో నష్టాన్ని పరిశీలించారు. రెండో బృందం మరిపెడ మండలం ఉల్లేపల్లిలో, సీతారాం తండాలో పర్యటించింది. జిల్లాలో రాత్రి 7 నుంచి 10గంటల వరకు కేంద్ర బృందాల పర్యటన కొనసాగింది. కాగా ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.5,438 కోట్ల మేరకు నష్టం వాటిల్లందని సీఎస్ శాంతికుమారి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కేంద్ర అధికారుల బృందం సచివాలయంలో సీఎస్, సీనియర్ అధికారులతో భేటీ అయ్యింది. వరదలు, వాటిల్లిన నష్టాలను కేంద్ర బృందానికి సీఎస్ శాంతికుమారి వివరించారు. ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో 332 హెక్టార్ల విస్తీర్ణంలో భారీ చెట్లు కూలిన సంఘటనలను, పర్యావరణ విపత్తు సమస్యను కూడా కేంద్ర బృందానికి సీఎస్ వివరించారు. విపత్తుకు మూలకారణాలను తెలుసుకునేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని కేంద్ర బృందం సీఎస్‌కు ఈ సందర్భంగా సూచించింది.

### • అడవుల్లో ప్రకృతి ప్రకోపం బాధాకరం


ములుగు జిల్లా అడవుల్లో భారీగా చెట్లు కూలిపోవడంపై కేటీఆర్ ట్విట్టర్‌లో వీడియో షేర్ చేశారు. 'ములుగు జిల్లా అడవుల్లో ప్రకృతి ప్రకోపం అత్యంత బాధాకరం. ఇటీవలి బీభత్సానికి మేడారం- తాడ్వాయి అటవీ ప్రాంతంలో సుమారు 200 హెక్టార్లలో, లక్షకు పైగా చెట్లు నేలకూలినట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం వెంటనే ములుగు జిల్లా అటవీ ప్రాంతాన్ని భారీ చెట్ల పెంపకంతో సంరక్షించాలని, సుడిగాలి బీభత్సం వల్ల నష్టపోయిన గిరిజనులను త్వరగా ఆదుకోవాలి' అని కేటీఆర్ కోరారు.

# గాలే చెట్లను పెకిలించేసింది

- స్ట్రెయిట్ లైన్ విండ్ స్టార్మ్స్ వల్లే నేలకూలిన వృక్షాలు
- తాడ్వాయి ఘటనపై అటవీశాఖ ప్రాథమిక నిర్ధారణ

వరంగల్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి అటవీప్రాంతంలో భారీగా చెట్లు కూలిపోవడానికి సమాంతర ఉధృత గాలుల (డౌన్ బస్ట్ అండ్ స్ట్రెయిట్ లైన్ విండ్ స్టార్మ్స్) కారణమని అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. 28 ఏండ్ల క్రితం మధ్యప్రదేశ్‌లో నౌరాదేహి అభయారణ్యంలో ఇదే తరహాలో ఉపద్రవం వచ్చి చెట్లు భారీగా కూలిపోయాయని, 13 ఏండ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ప్రాంతంలో ఇలాంటి విపత్తు వల్ల 1,200 ఎత్తయిన టేకు చెట్లు పడిపోయాయని వెల్లడించారు. గాలి పీడనం ఎక్కువగా ఉండి అది ప్రయాణించే మార్గంలో అడ్డుగా ఉన్న వాటిని కూల్చేస్తుందని, తాడ్వాయిలో అలాగే జరిగిందని వివరించారు. అప్పుడు జరిగిన నష్టం, వాతావరణ మార్పుల తీవ్రత.. తాడ్వాయిలో జరిగిందీ ఒకే రకంగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర వాతావరణశాఖ పరిధిలోని వాతావరణ పరిశీలన కేంద్రం(అబ్జర్వేటరీ) ఈ ప్రాంతంలో లేకపోవటంతో ఎలాంటి ఉపద్రవం జరిగిందనేది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి ఉన్నదని అంటున్నారు. ప్రస్తుతం 10 అటవీ బృందాలు పడిపోయిన చెట్లను లెక్కిస్తూ సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. సంరక్షణ చర్యలు కచ్చితంగా కొనసాగిస్తే ఐదారేండ్లలో అటవీ ప్రాంతం తిరిగి పునరుజ్జీవమయ్యే అవకాశం ఉంటుంది.

## అడవులను రక్షించుకుందాం

### మాజీ ఎంపీ సంతోష్‌కుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): అటవీ శాఖ అమరవీరుల స్ఫూర్తిగా అడవులను రక్షించుకుందామని గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. అటవీ అమరవీరుల దినం సందర్భంగా అమరవీరులకు బుధవారం ఆయన నివాళులర్పించారు. ఎక్స్ వేదికగా అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

# పోలీసు బిడ్డలకు రెసిడెన్షియల్ స్కూల్స్

- హైదరాబాద్, వరంగల్‌లో 50 ఎకరాలు కేటాయిస్తాం
- ఆరు నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య
- ఎస్సైల దీక్షాంత్ పరేడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్‌కు ఒకరోజు వేతనం అందించిన పోలీసులు


పోలీసు విభాగం తరపున ఒకరోజు వేతనం రూ.11,06,83,571 చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేస్తున్న డీజీపీ జితేందర్, డీజీ శివధర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): పోలీసుల పిల్లలకు ఆరో తరగతి నుంచి పీజీ వరకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించేందుకు సైనిక్‌స్కూల్ తరహాలో పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెలంగాణ పోలీసు అకాడమీలో ట్రైనీ ఎస్సైల దీక్షాంత్ పరేడ్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో పోలీసు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని ప్రకటించారు.

**ప్రజల్లో విశ్వాసం కల్పించండి**

వ్యసనాలకు బానిసలైన కొంతమంది డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, శిక్షణ పొందిన ఎస్సైలు విధుల్లో చేరిన తర్వాత వాటిపై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎస్సైలందరినీ చూ స్తుంటే, తెలంగాణ డ్రగ్స్ రహితంగా మారుతుందన్న నమ్మకం కలుగుతున్నదని చెప్పారు. పోలీసుది ఒక ఉద్యోగం మాత్రమే కాదని అదొక భావోద్వేగమని చెప్పారు. ఏ సమస్య వచ్చినా ముందుగా అందుబాటులో ఉండేది పోలీసులేనని, వారి సాయంతో డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. డ్రగ్స్ పేరు వింటేనే మోకాళ్లలో వణుకు పుట్టాలని అన్నా రు. పోలీస్‌స్టేషన్‌కు కన్నీళ్లతో వచ్చిన వారితోనే ఫ్రెండ్లీగా ఉండాలని నేరస్తులతో కాదని చెప్పా రు. 'ప్రస్తుతం కాస్మెటిక్ పోలీసింగ్ కాదు.. కాంక్రీట్ పోలీసింగ్ అవసరం' అని స్పష్టంచేశారు.

**సీఎంఆర్‌ఎఫ్‌కు 11.6 కోట్ల విరాళం**

ఈ సందర్భంగా పోలీసు విభాగం తరపున ఒకరోజు వేతనం నుంచి రూ.11,06,83,571 నిధులను ముఖ్యమంత్రి సహాయనిధికి డీజీపీ జితేందర్, డీజీ శివధర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుల సహాయక చర్యను సీఎం అభినందించారు. పరేడ్ అనంతరం పోలీసు అకాడమీలో నిర్మించిన క్రీడాభవన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అందులోని బ్యాడ్మింటెన్ కోర్టులో కాసేపు బ్యాడ్మింటెన్ ఆడారు. అంతకుముందు ట్రైనీ ఎస్సైల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, డీజీపీ జితేందర్, ఆర్‌బీఆర్‌ఆర్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ట్రై కమిషనరేట్ల సీపీలు, సీనియర్ ఐపీఎస్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, పెద్ద సంఖ్యలో ట్రైనీ ఎస్సైల బంధువులు పాల్గొన్నారు.

**కేసీఆర్ హయాంలోనే ఎస్సైల ట్రైనింగ్ ప్రారంభం**

2022 ఏప్రిల్‌లో 17,516 పోలీసు ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నాటి కేసీఆర్ ప్రభుత్వం పలు నోటిఫికేషన్లు విడుదల చేసింది. వాటిలో 16,929 కానిస్టేబుల్, తత్సమాన పోస్టులు, 587 ఎస్సై, తత్సమాన పోస్టులు ఉన్నాయి. ఎస్సై పోస్టులకు ప్రిలిమినరీ టెస్టు, ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించి నిరుడు ఆగస్టులోనే తుది ఫలితాలు ప్రకటించారు. అనంతరం గత ఏడాది సెప్టెంబర్‌లో శిక్షణను ప్రారంభించగా, 547 మంది ప్రస్తుతం శిక్షణ ముగించుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు 33/3 శాతం రిజర్వేషన్‌ను పోలీసు ఉద్యోగాల్లో కూడా అమలుచేయడంతో వివిధ విభాగాలకు చెందిన మహిళా ట్రైనీ ఎస్సైలు 147 మంది ఎంపికయ్యారు.

- ట్రైనీలలో గ్రాడ్యుయేట్లు 472 మంది ఉండగా వారిలో 248 మంది బీటెక్, ముగ్గురు బీఫార్మసీ, 221 మంది డిగ్రీ చేసిన వారున్నారు.
- పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ 75 మంది ఉండగా వారిలో ఎంటెక్ 26, ఎంఫార్మసీ 3, ఎంబీఏ 18, ఎంసీఏ 4, ఇతర కోర్సులు చేసిన వారు 24 మంది ఉన్నారు.
- మొత్తం 547 మందిలో 401 మంది సివిల్, ముగ్గురు పీటీవో, 12 మంది ఎస్పీఎఫ్, 22 మంది ఐటీ అండ్ సీ, 29 మంది టీజీఎస్పీ, 71 మంది ఏఆర్ అండ్ సీపీఎల్, తొమ్మిది మంది పింగర్ ప్రింట్ ఏఎస్సైలు ఎంపికయ్యారు.
- వీరిలో కొత్తగా పోలీసు ఉద్యోగంలోకి వచ్చిన వారు 344 మంది ఉండగా, ఇప్పటికే పోలీసు డిపార్ట్‌మెంట్‌లోఉద్యోగం చేస్తున్నవారు 109 మంది, వివిధ విభాగాల్లో ఉద్యోగం చేసినవారు 92 మంది ఉన్నారు.
- ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 547 మందిలో 26-30 ఏండ్లవారు 283 మంది, 21-25 ఏండ్ల వారు 182 మంది ఉన్నారు.

### • అంజన్న సన్నిధిలో మహిళా అఘోరా



కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని బుధవారం ఓ మహిళా అఘోరా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అఘోరా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు తాను అఘోరాగా మారినట్టు ఆమె తెలిపారు. -మల్యాల

### • వరాహానికి గోమాత పాలు

వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో ఓ వరాహానికి గోమాత పాలిచ్చి ఆశ్చర్యానికి గురిచేసింది. బుధవారం స్థానిక శ్రీ సాయివాణి కల్యాణమండపం ప్రాంగణంలో ఓ ఆవు కూర్చొని ఉండగా.. పంది వెళ్లి పాలు తాగింది.

-ఆత్మకూరు



# 21వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్

- నేడు కేంద్రమంత్రి అమిత్‌షాతో భేటీ
- వరద నష్టం, సాయంపై చర్చ
- పార్టీ అధిష్ఠానంతోనూ భేటీ ?
- మంత్రివర్గ విస్తరణపై చర్చ !

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి 21వ సారి ఢిల్లీకి వెళ్లారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయల్దేరిన ఆయన రాత్రికి ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఇటు అధిష్ఠానంతో, అటు కేంద్ర ప్రభుత్వ పెద్దలతో భేటీ కానున్నారు. గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నట్టుగా తెలిసింది. రాష్ట్రంలో కురిసిన వర్షాలు, నష్టంపై చర్చించి నష్టపరిహారం కోరనున్నట్టుగా తెలిసింది. ఆ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతోనూ భేటీ అయి మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. దీంతో పాటు హైడ్రా పరిణామాలను కూడా అధిష్ఠానానికి వివరించనున్నట్టుగా తెలిసింది

# కూతురికి తండ్రి సెల్యూట్

- తండ్రి ఏఆర్ ఏఎస్సై.. కూతురు ఏఆర్ ఎస్సై
- ఎస్సైల పరేడ్‌లో అరుదైన ఘటన

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): పిల్లలు ప్రయోజకులైనప్పుడు ఆ తండ్రి గుండె సంతోషంతో ఉప్పొంగిపోతుంది. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు తనకంటే పెద్ద హోదాను అందుకోవడంతో సెల్యూట్ చేస్తూ ఓ తండ్రి భావోద్వేగానికిలోనైన అరుదైన ఘటనకు ఎస్సై ట్రైనీ క్యాడెట్ల మూడో దీక్షాంత్ పరేడ్ వేదికైంది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న జీ రాంచందర్‌రావు కూతురు సౌమ్య తన విభాగంలోనే ఎస్సైగా శిక్షణ పూర్తి చేసుకోవడంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. బుధవారం పరేడ్ పూర్తి చేసుకున్న అనంతరం తన కూతురికి 'సెల్యూట్' చేశారు. బ్యాచ్‌లో టాప్-10లో చోటు సంపాదించడం, సీఎం రేవంత్‌రెడ్డి నుంచి 'చీఫ్ మినిస్టర్స్ రివాల్వర్ బెస్ట్ అండ్ బెస్ట్ ఆల్ రౌండర్' 'హోం మినిస్టర్ బాటెన్ విత్ సిల్వర్ ఎండ్ ఫర్ బెస్ట్ ఇండోర్' అవార్డులు అందుకోవడం గర్వంగా ఉందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. మొదటి సెల్యూట్ తండ్రి నుంచే దక్కడంతో ఏఆర్ ఎస్సై సౌమ్య భావోద్వేగానికి లోనయ్యారు.

